దుకాణంలో చోరీ

కుత్బుల్లాపూర్ : గోడ పైకప్పు రేకులను తొలగించి ఓ దొంగ హార్డ్‌వేర్ దుకాణంలో నగదు, ట్యాబ్ చోరీ చేసిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గుండ్ల పోచంపల్లిలోని శ్రీమాతా హార్డ్‌వేర్ దుకాణంలో మంగళవారం అర్ధరాత్రి పై అంతస్తు రేకులను తొలగించి లోపలికి ప్రవేశించిన ఓ దొంగ కౌంటర్‌లో ఉన్న రూ.30 వేల నగదు, రూ.25 వేల విలువ చేసే ఫోన్ ట్యాబ్ చోరీ చేసినట్లు గుర్తించారు. యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో ఆటో డ్రైవర్ మృతి

కుత్బుల్లాపూర్: అనుమానాస్పద స్థితిలో ఓ ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఏపీ రాష్ట్రం కర్నూలు జిల్లా ఆధోనీకి చెందిన ఈరన్న(35) ఆరు నెలల క్రితం నగరానికి వలసవచ్చి దూలపల్లిలో ఉంటున్నాడు. కొంపల్లికి చెందిన సూర్య అనే వ్యక్తికి చెందిన ఆటోను అద్దెకు తిప్పుతున్నాడు. రెండు రోజులుగా ఈరన్న ఆటో అద్దె చెల్లించడం లేదు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం జీడిమెట్లలోని డెక్లాతన్ సర్వీస్ రోడ్డులో ఆటో నిలిపి ఉంది. వెనుక సీట్లో ఓ వ్యక్తి ముక్కు నుంచి రక్తం కారుతూ, ఎడమ కాలికి గాయమైందని స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అప్పటికే సదరు వ్యక్తి మృతి చెందాడు. అతని ఆచూకీ కోసం ప్రయత్నించగా.. ఈరన్నగా తెలిసింది. ఏదైనా యాక్సిడెంట్‌లో గాయపడ్డాడా?, లేక ఎవరైనా కొట్టడంతో గాయపడి మృతి చెందాడా? అన్న కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ముగ్గులు పిల్లలున్నారు.

వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

దుండిగల్: వన్‌టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్‌ను ఆస్తి పన్ను బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఆస్తి పన్ను వడ్డీలో 90 శాతం మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు. మార్చి 31వ తేదీ వరకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్‌కు అవకాశముందన్నారు. సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కమిషనర్ కోరారు.

అటవీ స్థలంపై కలెక్టర్‌కు నివేదిక

సుభాష్‌నగర్: గాజులరామారంలోని కబ్జాకు గురైన అటవీ స్థలం నివేదికతో పాటు సదరు స్థలంలో వెలిసిన నిర్మాణాలను తొలగించి, అటవీ స్థలంలో కలపాలని గ్రీన్ ట్రిబ్యునల్ ఇటీవల కలెక్టర్, మున్సిపల్, అటవీ శాఖను ఆదేశించింది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు ఇటీవల సర్వే నిర్వహించి 486 ఎకరాలకుగాను 447.04 ఎకరాలు ఉందని గుర్తించారు. 20 ఎకరాల 2 గుంటల్లో నిర్మాణాలు చేపట్టారని పేర్కొన్నారు. మిగతా 18 ఎకరాల 34 గుంటలు స్థలం దొరకడం లేదని కలెక్టర్‌కు నివేదించారు.

అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చర్యలు

రంగారెడ్డినగర్: పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ అన్నారు. బుధవారం డివిజన్‌లోని రంగారెడ్డినగర్, వెంకట్రామిరెడ్డినగర్, గాంధీనగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డ్రైనేజీ లైన్ల పనుల నేపథ్యంలో తవ్విన రోడ్లకు నిధులు మంజూరయ్యాయని, పనులను వెంటనే ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఆయా బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆహ్వానం అందజేత



ఆహ్వానం అందజేస్తున్న రఫియా బేగం

నిజాంపేట్ : తెలంగాణ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి రఫియా బేగం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డిని రంజాన్ వేడుకలకు ఆహ్వానించారు. బుధవారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, బక్షా తదితరులు పాల్గొన్నారు.

'రాజీవ్ యువ వికాసం'ను పకడ్బందీగా అమలు చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

సాక్షి,సిటీబ్యూరో: రాజీవ్ యువ వికాసం పథకం కార్యక్రమం ద్వారా ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ అర్హులకు ఉపాధి అవకాశాలను కల్పించాల్సిన అవసరం ఉందని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా తెలిపారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. రాజీవ్ యువవికాసం కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని రాధికాగుప్తా పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు వినోద్‌కుమార్, ఝాన్సీరాణి తదితరులున్నారు.



చెల్లించిన ఫీజు వెనక్కిరాక!

క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూపులు

ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణ అంశంపై ప్రభుత్వం ఎటూ తేల్చక దరఖాస్తుదారుల్లో ఆందోళన నెలకొంది. 2014లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం 58, 59 జీవో కింద అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 59 జీవో కింద నియోజకవర్గ పరిధిలోని మురికివాడ ప్రాంతాల్లో ఉన్న వారు ప్రభుత్వం సూచించిన డబ్బులు చెల్లించారు. వారికి ఇప్పటికీ క్రమబద్ధీకరణ జరగకపోవడంతో ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. కలిసిన అధికారులతో గోడు వెళ్లబోస్తున్నారు. ఈ విషయంపై ఏ ఒక్క అధికారి క్లారిటీ ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– కుత్బుల్లాపూర్

- కార్యాలయం వద్ద పడిగాపులు
- అయోమయంలో దరఖాస్తుదారులు

జీవో 58, 59 కింద వచ్చిన దరఖాస్తులు

2014 డిసెంబర్‌లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారి అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణకు జీవో 58, 59 జారీ చేసింది. ఈ నేపథ్యంలో 2014 జూన్ రెండుకు ముందు నిర్మించిన నిర్మాణాలను క్రమబద్ధీకరణ చేస్తామని స్పష్టం చేశారు. అప్పట్లో జీవో 58 కింద 37, 399 దరఖాస్తులు రాగా.. వాటిలో 20,445 దరఖాస్తులను పరిష్కరించి 16, 854 వివిధ కారణాలతో పక్కన పెట్టారు. అదేవిధంగా 100 దరఖాస్తులను తిరస్కరించారు. జీవో 59 కింద 2756 దరఖాస్తులు రాగా 470 పరిష్కరించి 2286 పెండింగ్‌లో పెట్టారు. ఇదే క్రమంలో 2022 ఫిబ్రవరి 8వ తేదీన మరోసారి క్రమబద్ధీకరణకు ఉత్తర్వులు జారీ చేయగా.. 58 జీవో కింద 4461 దరఖాస్తులు రాగా 59 జీవో కింద 7961 దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిశీలించి జిల్లా కలెక్టర్ ఆమోదానికి పంపగా 900 ఎంపిక చేశారు. వీరంతా డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకున్నారు. రెవెన్యూ అధికారుల కనుసన్నల్లో



జీవో 58, 59 కింద దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సేకరిస్తున్న ప్రత్యేక అధికారి

అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణ జరిగిందని అప్పట్లో గుసగుసలు వినిపించాయి. భారీ ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు తేలింది. మిగిలిన దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయకుండానే వదిలేశారు.

సైట్ ఓపెన్ కావడం లేదు

59 జీవో కింద అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణలో భాగంగా దరఖాస్తు చేసుకొని డబ్బులు చెల్లించిన వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అప్పటి ప్రభుత్వం జీవో 58, 59 ప్రకారం జారీ చేసిన ఉత్తర్వుల నేపథ్యంలో దరఖాస్తు చేసుకున్న వారికి విడుతల వారీగా రిజిస్ట్రేషన్ చేశాం. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో అధికారుల నిర్ణయం మేరకు సైట్ ఓపెన్ కాగానే డబ్బులు కట్టిన ప్రతి ఒక్కరికీ క్రమబద్ధీకరణ పూర్తి చేస్తాం.

– మల్లికార్జున్ రావు, కుత్బుల్లాపూర్ డిప్యూటీ తహసీల్దార్

రసీదులు పట్టుకొని కార్యాలయాల చుట్టూ..

2014 డిసెంబర్ 3వ తేదీన ఒకసారి.. 2022 ఫిబ్రవరి 8వ తేదీన మరోసారి.. 2023 మార్చి ఒకటో తేదీన అప్పటి ప్రభుత్వం అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణ జీవో జారీ చేయగా 59 జీవో కింద 3300 దరఖాస్తులు వచ్చాయి. వీటిని అప్పటి కలెక్టర్ ఆమోదానికి పంపగా 580 దరఖాస్తుదారులకు డబ్బులు చెల్లించాలని 2023 జూన్ నోటీసులు జారీ చేశారు. వీరిలో 59 మంది డబ్బులు చెల్లించి స్థలాల రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకున్నారు. అయితే మరి కొంత మంది డబ్బులు చెల్లించిన వారికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేయకపోవడంతో రసీదులు పట్టుకొని కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సీఎంఆర్‌ఎఫ్‌తో కార్పొరేట్ వైద్యం



చెక్కులు అందజేస్తున్న కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్

రంగారెడ్డినగర్: సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుతున్నాయని రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ అన్నారు. బుధవారం చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో బాలయ్యనగర్‌కు చెందిన బాసప్పకు రూ.2 లక్షలు, రంగారెడ్డి నగర్‌కు చెందిన జోసెఫ్‌కు రూ.2 లక్షల చొప్పున సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వివేకానంద్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ వివిధ డివిజన్ల అధ్యక్షులు విజయ్‌రామిరెడ్డి, శంకరయ్య, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్‌యాదవ్, కస్తూరి బాలరాజ్, అడ్వకేట్ కమలాకర్, నగేష్, ఓంకార్ రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పన్నుల చెల్లింపునకు ఐదు రోజులే గడువు

కుత్బుల్లాపూర్: పన్నులు చెల్లించి అభివృద్ధికి దోహదపడాలని కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహ అన్నారు. సర్కిల్ 25 పరిధిలో 2024–25 మార్చి 31 వరకు రూ. 54. 36 కోట్ల రూపాయలు వసూలు చేయాల్సి ఉండగా బుధవారం వరకు రూ. 51. 61 కోట్లు వసూలు అయ్యాయి. వారం రోజులుగా వివిధ ప్రాంతాల్లో రెడ్ నోటీసులు జారీ చేసిన వ్యాపార, వాణిజ్య, గృహ సముదాయాలను సీజ్ చేస్తూ వారి వద్ద మొండి బకాయిలను వసూలు చేస్తున్నారు. ఐదు రోజులు మిగిలి ఉండటంతో బిల్ కలెక్టర్లు, రెవెన్యూ అధికారులకు ప్రతిరోజు టార్గెట్ విధించారు. రోజుకు రూ.5 లక్షల చొప్పున ఎనిమిది మంది అధికారులు వసూలు చేయాలని ఉప కమిషనర్ ఆదేశించారు. బుధవారం పెద్ద ఎత్తున



కౌంటర్లను పరిశీలిస్తున్న ఉప కమిషనర్ నరసింహ

పన్నులు చెల్లించేందుకు జనం సర్కిల్ కార్యాలయానికి చేరుకోవడంతో అదనంగా రెండు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఫైన్ రూపేనా చెల్లించాల్సిన మొత్తంలో 90 శాతం మినహాయింపు ఉండటంతో ప్రజలు పెద్ద ఎత్తున కార్యాలయానికి వస్తున్నారు.

ధాన్యంలో తడి,తాలు లేకుండా రైతులను చైతన్య పరచాలి

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి



అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, వ్యవసాయశాఖ అధికారులు

సాక్షి,సిటీబ్యూరో: రైతులు వరి ధాన్యాన్ని తడి,తాలు, దుమ్ము లేకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చేలా చైతన్యపరచాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి.విజయేందర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో యాసంగి 2024–25 కాలానికి సంబంధించి 'ధాన్యం సేకరణ'పై కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, రైస్ మిల్లుల యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ సుగుణబాయి, వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రకళ, జిల్లా సహకారశాఖ అధికారి వెంకట్‌రెడ్డి, సహకార సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వరికోత సమయంలో వరినూర్పిడి యంత్రాల వారితో మాట్లాడి ఓ క్రమపద్ధతిలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

సన్న ఒడ్లు, దొడ్డు వడ్లను వేరుచేసి..

ఒకే కేంద్రంలో సన్న వడ్లు, దొడ్డు వడ్లకు ప్రత్యేక విభాగాలను ముందస్తుగా ఏర్పాటు చేయాలన్నారు. వాటి లోడులను కూడా వేర్వేరుగా రైస్ మిల్లులకు పంపాలన్నారు. ఈ మేరకు రిజిస్టర్లను కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ప్రభుత్వ నియమాల ప్రకారం అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవడంతో పాటు వారు విక్రయించిన ధాన్యం డబ్బులు 48 గంటల్లో నేరుగా వారి ఖాతాలో జమ చేయాలన్నారు. అధికారులు సమిష్టిగా పనిచేసి జిల్లా, ప్రభుత్వానికి ధాన్యం కొనుగోళ్ల విషయంలో మంచిపేరు తీసుకురావాలని సూచించారు.

బస్సు షెల్టర్లు ఏర్పాటు చేయాలని సీపీఎం వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిజాంపేట్ : ప్రగతినగర్ మెయిన్ రోడ్డు 100 ఫీట్ల రోడ్డులో వివిధ చౌరస్తాల్లో బస్సు షెల్టర్లను ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి. వెంకటరామయ్య ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రగతినగర్‌లో గతంలో 3 బస్సు షెల్టర్లు ఉండేవని, అందులో ఒకటి రోడ్డు వెడల్పులో భాగంగా తొలగించారని తెలిపారు. ప్రస్తుతం బస్సుల సంఖ్య పెరగడంతో బస్సు ప్రయాణికుల సంఖ్య కూడా పెరిగిందన్నారు. ప్రయాణికులు నిలబడటానికి మాత్రం బస్సు షెల్టర్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా అలీఫ్ చౌరస్తా, కాకతీయ హిల్స్ చౌరస్తా, ఎలిఫెంట్ చౌరస్తా, మూడు కోతుల బొమ్మల చౌరస్తాలో వెంటనే బస్సు షెల్టర్లను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్.సంతోష్, బాల వెంకటేశ్వర, ఎస్.బాలపీరు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి దృష్టి సారించాలి



సమస్యలు తెలుసుకుంటున్న భరతసింహారెడ్డి

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. బుధవారం జీడిమెట్ల డివిజన్ హెచ్‌ఏఎల్ రాఘవేంద్ర కాలనీలో పర్యటించారు. డ్రైనేజీ సమస్యతో పడుతున్న ఇబ్బందులను స్థానికులు ఆయనకు వివరించారు. అనంతరం ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కుంట సిద్ధిరాములు, ప్రధాన కార్యదర్శి తోకల నగేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వర్, శంకరయ్య, బాలరాజు, శివ, జోగిని రాజు, ప్రసాద్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు

వాటర్ వర్క్స్ ఆపరేషన్స్ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్

చింతల్: వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని వాటర్ వర్క్స్ ఆపరేషన్స్ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్ అన్నారు. కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో బుధవారం అధికారులతో వేసవి ప్రణాళికలపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ నుంచి జూన్ చివరి నాటికి తాగునీటి సరఫరాలో ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా కృషి చేయాలన్నారు. మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు చేపట్టేలా కృషి చేయాలన్నారు. ప్రతి లీకేజీని ఎమర్జెన్సీ లీకేజీగా ఎంచుకొని తక్షణ మరమ్మతులు చేపట్టాలన్నారు. అదే విధంగా వాటర్ ట్యాంకర్ల వెయిటింగ్ లిస్టుపై ప్రతి ట్యాంకర్ ఫిల్లింగ్ పాయింట్ల సమయపాలన పాటించాలన్నారు. కుత్బుల్లాపూర్‌లో ఉన్న వాటర్ ట్యాంకర్లతో పాటు మరో 15 ట్యాంకర్లను సమకూర్చుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. నూతన ఫిల్లింగ్ పాయింట్లు ఏర్పాటు చేయడంతో ఇప్పటికే 4 వాటర్ ట్యాంకర్లను ఏర్పాటు చేశామని,



అధికారులతో చర్చిస్తున్న వాటర్ వర్క్స్ ఆపరేషన్స్ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్

రాబోయే రోజుల్లో మరో 10 ట్యాంకర్‌లను అద్దెకు తీసుకొని ట్యాంకర్ బుకింగ్ వెయిటింగ్ లిస్టును తగ్గిస్తామని తెలిపారు. నీటి బకాయిల వసూళ్లను సిబ్బంది ఎప్పటికప్పుడు చేపట్టాలని, మొండి బకాయిదారులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని జీఎం, డీజీఎంలకు సూచించారు. సమావేశంలో వాటర్ వర్క్స్ సర్కిల్–4 సీజీఎం నారాయణ, జీఎం అశోక్, డీజీఎంలు రాజేష్, రవి, వికాస్, వాటర్ వర్క్స్ సీనియర్ ఆఫీసర్ అశోక్ కుమార్, వాటర్ వర్క్స్ ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ మేనేజర్లు, ఎలక్ట్రికల్ మేనేజర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాస్టర్లు

జీడిమెట్ల: పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం యాక్సిడెంట్ కాదని, అది ముమ్మాటికి హత్యేనని, విచారణ జరిపించాలని తెలుగు బాప్టిస్ట్ చర్చ్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ రెవరన్ డా.టి.సికామని అన్నారు. బుధవారం సుభాష్‌నగర్ డివిజన్ వెంకటాద్రినగర్‌లోని బెరియన్ బాప్టిస్ట్ చర్చిలో ఈనెల 24వ తేదీన ఏపీలో మృతిచెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అమెరికన్ బాప్టిస్ట్ పారిన్ మిషన్ సొసైటీ ఇండియా, తెలుగు బాప్టిస్ట్ చర్చ్ కౌన్సిల్, డెక్కన్ రీజియన్ సికింద్రాబాద్ తెలుగు బాప్టిస్ట్ ఫీల్డ్ అసోసియేషన్ పాస్టర్స్ పాస్టర్ ప్రవీణ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రవీణ్ శరీరంపై ఎలాంటి గాయాలు లేవని, ద్విచక్రవాహనం సైతం ఎలాంటి డ్యామేజ్ కాలేదని అన్నారు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి అక్కడ వేశారని పాస్టర్ల సంఘం సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డెక్కన్ రీజియన్ సికింద్రాబాద్ తెలుగు బాప్టిస్టు ఫీల్డ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రెవరన్ డాక్టర్ దామెర జెకర్యా, వైస్ ప్రెసిడెంట్ కె.ఎస్.జయకుమార్, టీబీసీసీ సభ కాపర్లు రెవరన్ సురేష్‌కుమార్, పాస్టర్ ఎస్. బాలరాజు, జనరల్ కౌన్సిల్ మెంబర్ ప్రొఫెసర్ డా. శామ్యూల్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా గ్రూపులను ఏర్పాటు చేయాలి

కుత్బుల్లాపూర్: జంట సర్కిల్ పరిధిలో కొత్త మహిళా గ్రూపులను త్వరితగతిన ఏర్పాటు చేయాలని స్టేట్ మిషన్ కో ఆర్డినేటర్ సుజాత అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో మహిళా గ్రూపు సభ్యులతో కలిసి బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు ఈ సర్కిల్‌లో 2100 గ్రూపులు ఉన్నాయని, వాటిలో 1950 రన్నింగ్‌లో ఉన్నాయని, మిగిలిన 150 గ్రూపులు ఇతర రాష్ట్రాలకు సంబంధించిన వారు వెళ్లిపోవడంతో లావాదేవీలు జరగడంలేదని ప్రాజెక్టు అధికారి హిమ బిందు వివరించారు. అనంతరం సుజాత మాట్లాడుతూ.. గ్రూపులు పెరిగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో మహిళలకు ప్రత్యేకంగా అవగాహన కల్పించి కొత్త గ్రూపులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ నెల రోజుల వ్యవధిలో టార్గెట్ పెట్టుకొని కొన్ని గ్రూపులను చేయాలన్నారు. వాటిని ఏ విధంగా చేయాలో వివరించారు.



మాట్లాడుతున్న స్టేట్ మిషన్ కో ఆర్డినేటర్ సుజాత



సమావేశంలో పాల్గొన్న మహిళా గ్రూపు సభ్యులు

నిధులు కేటాయించాలని మాజీ ఎమ్మెల్యే వినతి



దాన కిశోర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్ : కొంపల్లి మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, పలు ప్రాంతాల్లో ఔట్‌లెట్ లేక ఖాళీ స్థలాలు డ్రైనేజీకి నిలయంగా మారాయని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం నిధులను కేటాయించాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ (ఎంయూడీటీఎస్) దాన కిశోర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. పీఎంఆర్ ఎన్‌క్లేవ్ నుంచి ఫార్మ్ మేడోస్ వరకు, శాంతినగర్ కాలనీ నుంచి అపర్ణ ఫార్మో సెప్టిక్ ట్యాంకు వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, జయభేరి కాలనీ ఓల్డ్ గోడౌన్ రోడ్డు నుంచి సెంట్రల్ పార్క్ వరకు డ్రైనేజీ, సీసీ రోడ్లు, ఊరా చెరువు సుందరీకరణ అభివృద్ధి కోసం రూ. 10 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ డైరెక్టర్ జిమ్మీ దేవేందర్, కాంగ్రెస్ కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు బైరి ప్రశాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

30 రోజుల వేసవి శిక్షణ శిబిరాలు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిరి జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో మే 01 నుంచి 31 వరకు 14 ఏళ్ల లోపు ఉన్న బాలబాలికలకు ఉచిత వేసవి శిక్షణ శిబిరాల(క్రీడలు)ను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి గోపాల్‌రావు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 28 వరకు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి కార్యాలయంలో నేరుగా దరఖాస్తులను అందజేయాలన్నారు.

బీసీలకు రాజీవ్ యువ వికాసం పథకం

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి ఝాన్సీరాణి

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని నిరుద్యోగ యువతీ,యువకులకు స్వయం ఉపాధి అవకాశాల ద్వారా ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని ప్రకటించిందని బీసీ అభివృద్ధిశాఖ జిల్లా అధికారి ఝాన్సీరాణి తెలిపారు. అర్హత 21–55 ఏళ్లు (01 జూలై 2025 నాటికి) కలిగి ఉన్న అభ్యర్థులు మాత్రమే ఉపాధి హామీ పథకాలకు అర్హులన్నారు. 21–60 ఏళ్లున్న అభ్యర్థులు భూ సంబంధ, ఉద్యాన, వ్యవసాయ పరికరాల పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థి సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ/ మున్సిపాలిటీ ప్రాంతాల వారికి రూ.2 లక్షలు మించి ఉండకూడదన్నారు. దరఖాస్తుదారులు సూచించిన ధ్రువపత్రాలను జతపరచాల్సి ఉంటుందన్నారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు లేదా ఆదాయ ధ్రువపత్రం, కుల ధృవీకరణపత్రం (తెలంగాణ ఏర్పడిన తర్వాత జారీ చేసినది మాత్రమే), డ్రైవింగ్ లైసెన్స్ (రవాణా రంగం వారికి మాత్రమే), పట్టాదార్ పాస్‌బుక్ (వ్యవసాయరంగం వారికి మాత్రమే), సదరం సర్టిఫికెట్ (దివ్యాంగులకు మాత్రమే) ప్రతులతో సహా పాస్‌పోర్ట్ సైజు ఫోటోను దరఖాస్తుతో జతపరచాలని ఆమె సూచించారు. మీ–సేవ నుంచి ధ్రువపత్రాలు.. మీ–సేవ నుంచి పొందినవి మాత్రమే అంగీకరించబడతాయని స్పష్టం చేశారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కలెక్టరేట్‌లోని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.